# తొలి మహామంత్రిణి నాయకురాలు నాగమ్మ - సమీక్ష

- శ్రీశైల్ రెడ్డి పంజుగుల - srisail@gmail.com - 20 జూన్, 2011

Twopence to Cross the Mersey అనే ఒక కథ ఉంది. ఇది తన స్వీయానుభవాల్ని బ్రిటిష్ రచయిత్రి హెలెన్ ఫారెస్టర్ రాసారు. 1930లలో ఆమె కుటుంబం అనుభవించిన దుర్భర దారిద్ర్యాన్ని తెలిపే కథ. విశేషమేమంటే - రచయిత్రి ఒక థర్డ్ పర్సన్ (బయటివ్యక్తి)గా రాస్తారు. 'Vividly recreated with no self-pity' అని కితాబిచ్చింది సండే టెలిగ్రాఫ్ పత్రిక.

నేను చెప్పాలనుకున్నదేమంటే - రచయిత తాను రాసే విషయంపట్ల నిర్మోహంగా ఉండటం ఉత్తమ రచన లక్షణం. ఆయా పాత్రలతో, పరిస్థితులతో ఐడెంటిఫై అవడం, చిత్రణలోని న్యాయాన్యాయాలపై స్పందించడం, తీర్పివ్వడం పాఠకుల పని. రచయితే ఒక పక్షం వహిస్తే అది పాఠకుల్లోని వివేకాన్ని, చలనశీలతనూ సవాల్ చెయ్యడమే. వై.హెచ్.కె.మోహన్‌రావు 'తొలి మహామంత్రిణి నాయకురాలు నాగమ్మ' చదివాక నాకు కలిగిన తక్షణభావమిది.

ఏ యుద్ధం ఎందుకు జరిగిందో, ఏ రాజ్యం ఎన్నాళ్ళుందో - తారీఖులూ దస్తావేజులూ చరిత్ర విద్యార్థికి అత్యంతావసరం. పానిపట్టు యుద్ధమైనా పలనాటి యుద్ధమైనా రాజ్యకాంక్షతో జరిగేవే. పలనాటి యుద్ధమైనా కురుపాండవ యుద్ధమైనా ఏదీ ధర్మాధర్మాలతో పనిలేనిది. కౌరవుల ధర్మం కౌరవులది, పాండవుల ధర్మం పాండవులది. బ్రహ్మన్న ధర్మమూ నాగమ్మ ధర్మమూ అంతే. ఇందులో ధన, మాన, ప్రాణ నష్టం మాత్రమే జనసామాన్యానికి దక్కేవి.

గతించిన చరిత్ర తాలూకు అధ్యయనం చేస్తున్నప్పుడు చాలమంది రచయితలకు మీమాంస ఉంటుంది - ఎవరి పక్షం వహించాలని! అందుబాటులో ఉన్న మౌఖిక, లిఖిత, జానపద సాహిత్యాధారాలతో ఒక అంచనాకు రావటం జరిగినా, ముందుగానే తాను ఎవరిపక్షమో తెలుస్తుంది కాబట్టి కలం ఆలోచనల్ని దాటిపోలేదు. నాయకురాలు నాగమ్మ రచించిన మోహనరావు కూడా స్పష్టంగానే నాగమ్మ శిబిరంలో ఉన్నారనడానికి తార్కాణాలివిగో:

- పశువుల మందను తరలించడం గురించి రాస్తూ 'పల్నీడు ప్రయత్నం బలప్రయోగంగా మారుతుంది' అంటారు. పల్నీడుకు ఇష్టం లేకున్నా బలప్రయోగం చేయాల్సివచ్చిందన్న ధ్వని రచయిత ఎవరిపక్షం వహించాడో చెప్పకనే చెపుతుంది (పేజీ 24).
- అలరాజు రాయబార సందర్భంలో బ్రహ్మనాదుల వనవాసంలోని లోటుపాట్లను వివరించి నాయకురాలు తన ప్రభుభక్తిని చాటుకునే క్రమం అనిర్వచనీయం (పేజీ 32). క్షమించాలి ఇక్కడ నాగమ్మ గొప్పతనం ఏమీ కనిపించలెదు నాకు!
- కోడిపందెంలో ఓటమికి బ్రహ్మన్న అనాలోచిత నియంత పోకడే కారణం (పేజీ 22). కోడిపందేన్నీ, అందులో గెలవడాన్నీ గొప్పవిషయంగా భావిస్తున్నారు రచయిత.

అయితే ఒక్కమాట!

పదకొండో శతాబ్దంలో ఇప్పటి కరీంనగర్‌లోని అరవెల్లి గ్రామానికి చెందిన ఒక వనిత; తండ్రినీ, భర్తనూ, మేనమామనూ యుద్ధంలో పోగుట్టుకుని వితంతువుగా, నిరాశ్రయగా మిగిలిన ఒక వనిత – పరిస్థితులనెదిరించి మొక్కవోని ధైర్యంతో మహా మంత్రిణి స్థాయికి ఎదిగిన నాగమ్మ నిశ్చయంగా ప్రశంసార్హురాలే.

నేటికీ ముప్పైమూడు శాతం రిజర్వేషన్లు మేమిస్తాం అనే దశలో మగసమాజం - మీరిస్తే మేం తీసుకుంటాం అనే స్థితిలో మహిళాసమాజం ఉన్నది. పైకి ఏమి చెప్పినా మహిళాసాధికారత విషయంలో పురుషులు అంత 'ఉదారంగా' ఏమీ లేరు.  ఇంటా బయటా మహిళ హక్కులకోసం పోరాడుతూనే ఉంది, ఓడిపోతూనే ఉంది. మరి, వెయ్యేళ్లక్రితం కర్కషమైన పురుషాధిక్యాన్ని తట్టుకుని, ఎదిరించి, పోరాడి గెలిచి నిలచిన నాగమ్మ ధీర. ఇందుకే, ఈ ఒక్క కారణంతోనే ఆమెను అభిమానించవచ్చు తప్ప రాజరికపు ఎత్తులూ జిత్తులకూ సంబంధించి కాదు.  అందులో న్యాయమూ లేదు, మనం ఎవరిపక్షమూ వహించక్కర్లేదు.

అన్నదమ్ముల పగలూ ప్రతీకారేచ్ఛలూ రాజ్యకాంక్షలలో 'ధర్మం' వుందన్న భావన జీర్ణించుకున్న సగటు మానవుడి లాంటి అనపోతు తనను యుద్ధానికి రావద్దన్నందుకు ఆత్మహత్య చేసుకుంటాడు.  గోసంగులు (మాదిగలు) ఈ యుద్ధంలో న్యాయం లేదనీ, తాము దూరంగా ఉంటామనీ  చెపుతారు.  గోసంగులకు ఉన్న రాజకీయ పరిణతి లోపించిన రచయిత నాగమ్మ యుద్ధ తంత్రాలకు మోహపరవశుడైపోయారు.  ఒకవైపు వక్రీకరించబడివున్న చరిత్రను మరొకవైపు వక్రీకరించే ప్రయత్నం చేశారు. అదృష్టమేమంటే, ఈ ఇరు వక్రీకరణల తాకిడికి నిజం కాస్తైనా నిటారుగా నిలబడే అవకాశం ఉండడం.

పలనాటి యుద్ధం 1180లో జరిగింది. గుంటూరు సీమ ప్రాభవం పలనాటి యుద్ధంతో మసిబారి కాకతీయుల పాలనకు దోహదం చేసింది. మరొకసారి అధికార మార్పిడి జరిగింది. ఇంతకుమించి ఒరిగిందేమీ లేదు. అందుకే మహాకవి అన్నది - ఇవేవీ చరిత్రకర్థం కాదు అని.

చివరగా – ఇప్పటివరకూ బహుళ ప్రచారంలో ఉన్న pro-బ్రహ్మనాయుడి కథలోని మరో కోణాన్ని ఆవిష్కరించిన రచయితను తప్పకుండా అభినందించి తీరాలి.  ఒక ప్రత్యామ్నాయ వాదాన్ని తెలుసుకోగోరే జిజ్ఞాస ఉన్న ఎవరైనా చదవాల్సిన పుస్తకమిది.